RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
మంగళవారం 2 జూన్ 2026
quicktodaynews.com


# తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర చిరస్మరణీయం

**దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న నీళ్లు, నిధులు, నియామకాల అన్యాయాన్ని ఎదిరిస్తూ, స్వరాష్ట్ర సాధనతోనే ఈ వివక్షకు అంతం దక్కుతుందని సాగిన మలి విడత ఉద్యమంలో జనగామ ప్రాంతం కీలక పాత్ర పోషించింది. ఇక్కడి కవులు, కళాకారులు తమ కలానికి, గళానికి పదునుపెట్టి ఉద్యమ జ్వాలను రగిలించారు. ఆనాటి చారిత్రాత్మక స్మృతులను, ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన కొందరు ప్రముఖుల మనోగతాలను ఇక్కడ గుర్తుచేసుకుందాం.**


- క్విక్ టుడే న్యూస్, జనగామ




**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**

## ఆటపాటలతో ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ..


**జి. కృష్ణ (కవి, కళాకారుడు)**



స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్న జి. కృష్ణ తెలంగాణ ఉద్యమానికి ముందుండి నాయకత్వం వహించారు. కన్న పర శురాములు కన్వీనర్‌గా ఉన్న జె.ఏ.సి లో క్రియాశీలక సభ్యుడిగా ఉంటూ, తన ఎస్.సి.డి.ఎస్.ఎస్ కళా సంస్థ సిబ్బందితో కలిసి పలు విడతలుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. హైదరాబాద్, గజ్వేల్, భువనగిరి, వరంగల్, నల్గొండ ప్రాంతాల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తన గళాన్ని వినిపించారు. రిలే దీక్షా శిబిరాల్లో పాటలు పాడుతూ ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. జనగామలో జరిగిన 'ధూం ధాం' కార్యక్రమంలో కళాకారుడిగా పాల్గొనడమే కాకుండా, పొలిటికల్ జె.ఏ.సి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ పాల్గొన్న సభకు వ్యాఖ్యాతగా (యాంకర్) వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు.

## స్వచ్ఛంద సంస్థల మద్దతుతో ఉద్యమం..

**– పన్నీరు సత్యం**



జనగామ జె.ఏ.సి నేతృత్వంలో సాగిన ఉద్యమానికి స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలు వెన్నుదన్నుగా నిలిచాయి. అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ పోరాటంలో స్వచ్ఛంద సంస్థల పక్షాన ప్రత్యేకంగా రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఇందులో భాగంగా కళాకారుడు పన్నీరు సత్యం ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. గ్రామ స్థాయిలో ఉద్యమాన్ని రగిలించాలనే ఉద్దేశంతో ఆయన చీటాకోడూర్ గ్రామంలో 'ధూంధాం' నిర్వహించి, జె.ఏ.సి నాయకులను ఆహ్వానించి ప్రజలను చైతన్యపరిచారు. ప్రజలందరితో కలిసి ఎడ్లబండిపై వినూత్నంగా పాదయాత్ర చేస్తూ జనగామ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. దీని ప్రేరణతోనే మిగతా గ్రామాల్లోనూ పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. జనగామలోనే కాకుండా తాను పనిచేస్తున్న బచ్చన్నపేటలోని 'ధరణి మ్యాక్స్' సిబ్బందితో రిలే దీక్షలు చేయించారు. ప్రతి గ్రామం నుండి మహిళలు వచ్చి దీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ, ఆరు నెలల పాటు ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషించారు. అంతేకాకుండా, వాహనాలపై ఎ పి ఎస్ ఆర్ టి సి స్టిక్కర్ల స్థానంలో ధైర్యంగా టి జి ఎస్ ఆర్ టి సి స్టిక్కర్లు అంటించి నిరసన చాటిన ఘనత ఆయనది.

## పెంబర్తిలో వేయి బతుకమ్మలతో జాతర

**అయిలా సోమనర్సింహాచారి (కవి, గాయకుడు, హస్తకళాకారుడు)**



తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెంబర్తి జె.ఏ.సి కన్వీనర్‌గా ప్రముఖ హస్తకళాకారుడు అయిలా సోమనర్సింహాచారి సారథ్యం వహించారు. వీరి ఆధ్వర్యంలో పెంబర్తిలో వేయి బతుకమ్మల జాతర నిర్వహించి మహిళలను ఉద్యమంలో భాగస్వాములను చేశారు. దీక్షా శిబిరాల్లో స్వీయ రచనలతో, పాటలతో ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆయన పాడిన "దండు కదిలిందిర జంబాయిరే.. తెలంగాణ కదిలిందిరా జంబాయిరే", "వస్తున్నాదొస్తున్నాదీ నా గజ్జెల మోరారె.. తెలంగాణ వస్తున్నాదీ నా గజ్జెల మొరారే" వంటి పాటలు దీక్షా శిబిరాలను ఉద్రూతలూగించాయి. అప్పటి ప్రభుత్వం నిర్వహించిన 'రచ్చబండ' సభలను అడ్డుకునే క్రమంలో, అప్పటి ఆర్డీఓ వినయ్ కృష్ణారెడ్డి పెంబర్తిలో సభ నిర్వహించకుండా వేదికపైనే తెలంగాణ నినాదాలతో లొల్లి సృష్టించారు. ఆర్డీఓకు, చారికి మధ్య జరిగిన తీవ్ర వాగ్వాదాన్ని 'సాక్షి' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించి ఉద్యమానికి ఊతమిచ్చింది. ప్రొఫెసర్ కోదండరాం సింగరేణి ఉద్యమానికి వెళ్లకుండా పోలీసులు పెంబర్తి కళాతోరణం వద్ద అరెస్ట్ చేస్తున్నప్పుడు, పోలీసు వాహనాన్ని అడ్డుకుని రాస్తారోకో చేశారు. ఈ క్రమంలో చారితో పాటు 23 మంది ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేసి భువనగిరి జైల్లో నిర్బంధించారు. పెంబర్తిలో నిర్వహించిన 'రైలు రోకో' కార్యక్రమంలో భాగంగా పట్టాలపై వందలాది గొర్రెలను నిలిపినందుకు వీరిపై రైల్వే కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల నిమిత్తం వారం రోజుల పాటు సికింద్రాబాద్ రైల్వే కోర్టు చుట్టూ తిరిగి బెయిల్ సంపాదించారు. ప్రతిరోజు రాత్రి వేళల్లో గ్రామ కూడళ్లలో రైతులు, మహిళలు, వృద్ధులను కూర్చోబెట్టి పాటలు, మాటలతో తెలంగాణ ఆవశ్యకతను వివరించేవారు. జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన అనేక కవి సమ్మేళనాల్లో 'జరసం' సభ్యుడిగా పాల్గొని క్రియాశీలక పాత్ర పోషించారు.

## ప్రజల్లోకి బలంగా ఉద్యమకాంక్ష

**పెట్లోజు సోమేశ్వరాచారి (కవి, గాయకుడు, ఉపన్యాసకుడు)**



మలిదశ ఉద్యమంలో లెక్చరర్ జె.ఏ.సి ఆధ్వర్యంలో కవి, గాయకుడు పెట్లోజు సోమేశ్వరాచారి ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో తిరుగుతూ తన కలం, గళంతో ఉపన్యసించారు. తెలంగాణ ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులను చైతన్య పరిచారు. జనగామ రంగప్ప చెరువు నుండి మట్టిని తీసుకువచ్చి, ఉద్యమ చౌరస్తాలో తెలంగాణ తల్లికి ముడుపు కట్టే తెలంగాణ మట్టి సత్యాగ్రహం కార్యక్రమంలో కవి రెడ్డి రత్నాకర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాసిన "జనగామ ఉద్యమాల ఊపిరాయెను తెలంగాణమాయనో" అనే పాటను మీడియా ముందు పాడి వినిపించారు. జె.ఏ.సి మరియు లెక్చరర్ జె.ఏ.సి మిత్రులతో కలిసి రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. హైదరాబాద్ ఓయూ జె.ఏ.సి ఆధ్వర్యంలో జరిగిన అనేక కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ కవుల కవిత్వ కార్యక్రమంలో గోరేటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, నందిని సిధారెడ్డి వంటి ప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. 'ఓయూ విద్యార్థి గర్జన' సందర్భంగా ప్రత్యేకంగా పాట రాసి, స్వయంగా పాడుతూ ఉద్యమకాంక్షను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కవులు, కళాకారులకు మరియు ఆ సమయంలో తమ విలువైన కాలాన్ని కోల్పోయిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం తగిన కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరుతున్నారు.

## విజయవంతంగా ఉద్యమ కార్యక్రమాలు..

**గడ్డం మనోజ్ కుమార్ గౌడ్ (లెక్చరర్స్ జె.ఏ.సి నేత)**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మహోన్నత ఉద్యమంలో లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు, లెక్చరర్స్ జె.ఏ.సి మాజీ కో-కన్వీనర్ అయిన గడ్డం మనోజ్ కుమార్ గౌడ్ చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ సాగిన నిరాహార దీక్షలు, సకల జనుల సమ్మె, విద్యాసంస్థల బంద్‌లు, రిలే నిరాహార దీక్షల్లో ఆయన సక్రియ పాత్ర పోషించారు. లెక్చరర్స్ జె.ఏ.సి కో-కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, ఉద్యమ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు కృషి చేశారు. ఈ పోరాటంలో ప్రముఖ ఉద్యమకారులు దశమంత రెడ్డి, మంగళంపల్లి రాజు, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్, అర్కుబ్ సోమేశ్వర్‌లతో కలిసి పనిచేశారు. అధ్యాపకులను, విద్యార్థులను, ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో తన వంతు పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన ఈ చారిత్రాత్మక ఉద్యమంలో భాగస్వామిని కావడం తన జీవితంలోనే అత్యంత గర్వకారణంగా భావిస్తున్నట్లు మనోజ్ కుమార్ పేర్కొన్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో జనగామ కవులు, కళాకారులు, మేధావుల పాత్ర ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుంది. తమ ఆట, పాట, మాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర కాంక్షను రగిల్చి, సాధన దిశగా నడిపించిన వీరి పోరాటం చిరస్మరణీయం.